

భూగర్భ డ్రెయినేజ్ కల సాకారం

నరసాపురంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.87 కోట్లతో పనులు చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 8లో



నాట్లు ఆలస్యం

సార్వా సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అనుకూలించకపోవడంతో నాట్లు ఆలస్యమయ్యాయి. జిల్లాలో దాదాపు 79 శాతం నాట్లు పూర్తయ్యాయి. 8లో



గంజాయి స్వాధీనం

పాలకొల్లు మండలం బల్లిపాడు డంపింగ్ యార్డ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ యు.రవి ప్రకాష్ తెలిపారు. 8లో

సంక్షేమ విజయం

ఎన్నికలేవైనా వైఎస్సార్‌సీపీకే పట్టం

- ఉమ్మడి పశ్చిమలో విజయ దుందుభి
- 7 సర్పంచ్‌లకు 5 స్థానాలు కైవసం
- 73 వార్డులకు 50 చోట్ల విజయం
- పంచాయతీల్లోనూ అదేపట్టు
- సంక్షేమ పాలనకు సంపూర్ణ మద్దతు



పెదపాడు మండలం వీరమ్మకుంటలో ఎమ్మెల్యే కొఠారు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విజయోత్సవ సంబరాలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు భిన్నంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ మరోమారు అదే పట్టు కొనసాగించింది. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో స్వతహాగా ప్రజలు తమ ప్రాంతంలో ప్రజాభిమానం కొల్లగొట్టిన నాయకులకు, నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే వారికి మద్దతుగా నిలుస్తారు. అలాగే ఈ ఎన్నికల్లో స్థానికత, అభ్యర్థి సామాజికవర్గ బలం కూడా ప్రభావం చూపుతుంది. అయితే ఎన్ని కోణాల్లో చూసినా అంతిమంగా ప్రజలు జగనన్న సంక్షేమ పాలనకే మొగ్గు చూపారనేది పంచాయతీ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు వైఎస్సార్ సీపీకే మద్దతు పలుకుతారని ఇటీవల జాతీయ స్థాయిలో కొన్ని సంస్థలు చేసిన అధ్యయనాల నివేదికను నిజం చేస్తూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారు.

ఏకపక్షంగా ఫలితాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు దాదాపు ఏకపక్షంగా వచ్చాయి. ఏలూరు జిల్లాలో 4 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ రాగా.. ఒక స్థానం వైఎస్సార్ సీపీ మద్దతుదారుకు ఏకగ్రీవమైంది. మిగిలిన 3 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరగ్గా మూడు స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయఢంకా మోగించారు. అలాగే వార్డు సభ్యుల ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో 45 స్థానాలకు 31 స్థానాలను వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం ప్రతిపక్ష నాయకుల కుతంత్రం, డబ్బుల ఎర కారణాలతో మూడు సర్పంచ్ స్థానాలకు గాను రెండు స్థానాలను వారు గెలుపొందారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారు ఒక స్థానంలో ఏకగ్రీవమయ్యారు. అలాగే 28 వార్డు సభ్యుల స్థానాలకు గాను 19 చోట్ల వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి ఉందని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తమ ఓటుతో తిప్పికొట్టారు. మొత్తంగా ఉమ్మడి పశ్చిమగోదావరి ప్రజలు మరోమారు సీఎం జగన్‌పై అభిమానాన్ని చాటారు.



ముదినేపల్లి మండలం వణుదుర్రులో వైఎస్సార్ సీపీ నాయకుల సంబరాలు (ఫైల్)

టీడీపీ అడ్డదారులు

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులను ఎలాగైనా ఓడించి ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజాదరణ తగ్గిందని ప్రచారం చేసుకుని తద్వారా వచ్చే శాసనసభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రతిపక్ష టీడీపీ అడ్డదారులన్నీ తొక్కినా ప్రయోజనం శూన్యమయింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నోట్లకట్టలను ఎరగా వేసి విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేసి కొన్ని సీట్లను సాధించగలిగింది. కాగా టీడీపీ గెలిచిన చాలా స్థానాల్లో గతంలో ఆ పార్టీకి చెందిన సభ్యులు మరణించడంతో ఏర్పడిన ఖాళీలే కావడంతో స్థానికులు వారిపై సానుభూతి చూపారు. ఈ వాపును చూసి టీడీపీ బలుపు అనుకుంటోందని విశ్లేషకులు చురకలు వేస్తున్నారు.



మరడాని వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు, వీరమ్మకుంట సర్పంచ్



చెల్లుబోయిన ప్రమీలకుమారి, దొడ్డిపట్ల సర్పంచ్



వేము రాజు, అడవినెక్కలం సర్పంచ్



చిన్నం సుగుణబాబు, వణుదుర్రు సర్పంచ్

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



యడ్లపల్లి రాధిక, శ్రీనివాసపురం సర్పంచ్

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని మండలంలోని శ్రీనివాసపురం పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన యడ్లపల్లి రాధిక (వైఎస్సార్ సీపీ మద్దతుదారు) అన్నా రు. ఆదివారం సర్పంచ్ రాధిక విలేకరులతో మా ట్లాడుతూ ఉప ఎన్నికల్లో తాను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన భర్త దుర్గారావు సర్పంచ్‌గా గత పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికయ్యారని, కొంతకాలం క్రితం ఆయన మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైందన్నారు. పంచాయతీ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేయాలనే ఆలోచనతో దుర్గారావు ఉండేవారని, ఆయన ఆశించిన అభివృద్ధి, సంక్షేమానికి తాను కృషిచేస్తానని రాధిక అన్నారు.

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్‌గా పూర్తి బాధ్యతలు



డీఆర్వో కృష్ణవేణికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ కలెక్టర్‌గా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కె.కృష్ణవేణిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆమె ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఎం.సూర్యతేజ కేఆర్ పురం ఐటీడీఏకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సబ్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన డీఆర్వో కృష్ణవేణిని తహసీల్దార్ ఫాజిల్, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ యేడిద శ్రీనివాస్, ఆర్ఐ యశోద, డిప్యూటీ తహసీల్దార్ నాగదేవి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కృష్ణవేణి నరసాపురం కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్‌లకు ఇంటింటి ఓటరు జాబితా సర్వేపై సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి భక్తుల తాకిడి



బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలో అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విశేష పూజలు చేశారు.

ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే నెల 5న గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 22న మధ్యాహ్నం ఒంటి గంటలోపు సంబంధిత తనిఖీ అధికారి ద్వారా డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. కనీసం 15 ఏళ్ల సేవాకాలం పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్ ఎడ్యుకేటర్లు అర్హులని, గతంలో జిల్లా స్థాయి అవార్డులు పొంది ఉండాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన వారు అనర్హులని పేర్కొన్నారు. ఆరోపణలు, క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు ఉన్న ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేయడానికి అనర్హులన్నారు. మండల స్థాయిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను మండల స్థాయి కమిటీ ద్వారా, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డివిజన్ స్థాయి కమిటీ ద్వారా సమర్పించాలని సూచించారు. దరఖాస్తు నమూనాను సంబంధిత తనిఖీ అధికారుల వద్ద పొందవచ్చని, మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ సేవాదళ్ విభాగం సమావేశానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎంపీ, పార్టీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హాజరుకానున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు తణుకు జాతీయ రహదారి సమీపంలోని సీఎం ఫంక్షన్ హాలులో పార్టీ సేవాదళ్ విభాగం, మధ్యాహ్నం 3.30 గంటలకు బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో తణుకు నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశాల్లో ఎంపీ మిథున్ రెడ్డి పాల్గొంటారని వివరించారు.

ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం

మానవహక్కుల కౌన్సిల్ జాతీయ చైర్మన్ సతీష్



ఏలూరు (టూటౌన్): సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందించేందుకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కృషి చేస్తుందని సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ సతీష్ దేవరపల్లి అన్నారు. ఏలూరు మినీ బైపాస్‌లోని కేకే టవర్స్‌లో ఏర్పాటుచేసిన ఏలూరు జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ముందుగా సౌత్ ఇండియా కో–ఆర్డినేటర్ డి.బాబూరావు రిబ్బన్ కత్తిరించగా, జాతీయ చైర్మన్ సతీష్ జ్యోతి ప్రజ్వలనం గావించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సతీష్ మాట్లాడుతూ మానవ హక్కుల గురించి అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా న్యాయపరమైన ఇబ్బందుల్లో ఉంటే వారికి న్యాయ సహాయం చేయడానికి తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు డి.నాగమణి, జాతీయ ప్రధాన కార్యదర్శి తణుకు గౌరీ శంకర్, జాతీయ ఉపాధ్యక్షుడు కోర్ల నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పి.గిరిబాబు, ప్రధాన కార్యదర్శి బి.బాలకష్ణ, స్టేట్ మీడియా కో–ఆర్డినేటర్ వి.నాగేశ్వరరావు, సంస్థ నాయకులు రావూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటింటా ఓటర్ల సర్వే

కలెక్టర్ ప్రశాంతి



ఆచంట మండలం వల్లూరులో ఓటర్ల సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ : వివాదాలకు తావులేకుండా ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేను నూరుశాతం పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం ఆచంట మండలం వల్లూరులో ఇంటింటా ఓట్ల సర్వే, గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. ఓటర్ల మార్పులు, చేర్పులపై ఆరా తీశారు. అనంతరం సచివాలయంలో అధికారులు, బీఎల్‌ఓలు, సచివాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిబంధనలు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేర్పులు మార్పుల్లో రెండు శాతం కంటే ఎక్కువ ఉంటే తప్పనిసరిగా తహసీల్దార్ పర్యవేక్షించాలన్నారు. బీఎల్‌ఓలు ఎటువంటి ఒత్తిడికి లొంగరాదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తనిఖీ చేసే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, తహసీల్దార్ ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు పాల్గొన్నారు.

జున్నూరు సచివాలయం తనిఖీ

పోడూరు : జున్నూరు సచివాలయం-1ను కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేసి ఓటర్ల సర్వే తీరును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్, ఆర్ఐ కె.రాంబాబు, వీఆర్వో బుజ్జి, సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు ఆమె వెంట ఉన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

యలమంచిలి : ఓటర్ల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. అడవిపాలెంలో ఓట్ల తనిఖీ నూరు శాతం పూర్తి కావడంతో అడవిపాలెం వచ్చి బీఎల్వోలను ఆమె అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన గ్రామా ల్లో నూరుశాతం సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్‌ను ఆదేశించారు. సర్వే సమయంలో నాయకుల ఒత్తిళ్లకు లొంగవద్దని, అలసత్వం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఏఈఆర్వో కేసీహెచ్ అప్పారావు ఆమె వెంట ఉన్నారు.

9 నెలల ముందే కాడి వదిలేసిన ప్రతిపక్షాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా



తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని సింగిల్‌గా ఎదుర్కొలేక ఆ నలుగురు కలిసి పోటీ చేయడానికి సిద్ధపడటం సిగ్గుచేటని ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు సీఎం జగన్‌తో తలపడేందుకు భయపడుతున్నాడని ఎద్దేవా చేశారు. దీంతో తొమ్మిది నెలల ముందే తాము ఓడిపోతామని గ్రహించి కాడి వదిలేశారన్నారు. ధర్మానికి, అధర్మానికి జరిగే ఎన్నికల యుద్ధంలో ధర్మానికే ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తుంటే టీడీపీ, జనసేన పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. రౌడీషీటర్లకు, ఎక్కువగా కేసులు ఉన్నవారికే పార్టీ టికెట్లు ఇస్తామని లోకేష్ చెప్పడం ఆయన మానసిక పరిస్థితిపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే ఈ రాష్ట్రానికి శాంతి కలుగుతుందన్నారు. సంఖ్యా పరంగా రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న కాపు సామాజికవర్గంపై చంద్రబాబు ఎల్లప్పుడూ ద్వేషం కక్కుతూనే ఉన్నాడని విమర్శించారు. పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లో లేకపోతే తాను శాశ్వతంగా ప్రతిపక్ష నాయకుడిగా ఉంటానని చంద్రబాబు భావిస్తూ జగన్ ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిని పవన్‌కళ్యాణ్ అర్థం చేసుకోలేకపోతున్నాడని అన్నారు.

దివ్యాంగులను చూసి చలించి..

పుట్టుకతో దివ్యాంగులైన ఇద్దరిని చూసి మంత్రి కొట్టు సత్యనారాయణ చలించిపోయారు. భాగ్యలక్ష్మీపేటకు చెందిన వడిసెల శ్రీనివాసరావు, మణి దంపతుల పిల్లలు పుట్టుకతో దివ్యాంగులు. వీరి కుమారుడు క్రాంతికుమార్ (19), కుమార్తె సాయి దీప్తి (17) వైకల్యంతో బాధపడుతున్నారు. శ్రీనివాసరావు హమాలీ పని, మణి ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దివ్యాంగుల పిల్లలతో కుటుంబాన్ని సాకడం ఇబ్బందిగా ఉందని మంత్రి కొట్టు దృష్టికి వారు తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. డీఎంహెచ్‌ఓతో ఫోనులో మాట్లాడి వీరిద్దరికీ దివ్యాంగుల పింఛన్ ఇప్పించేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి కొట్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘాటెక్కిన ఉల్లి

- పెరుగుతున్న ధరలు
- రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.35
- మరింత పెరిగే అవకాశం



తాడేపల్లిగూడెం: ఉల్లిపాయల ధరలు పేలుతున్నాయి. టమాట ధరలు తగ్గుముఖం పడుతున్న తరుణంలో ఉల్లి ధరలు ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఒక్కసారిగా రిటైల్ మార్కెట్‌లో 75 శాతం పెరుగుదల కనిపించగా వినియోగదారులు కలవరపడుతున్నారు. నిన్నమొన్నటి వరకూ కిలో రూ.20 ఉండే ధర ఏకంగా రూ.35కు చేరింది. మరింత ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. డిమాండ్‌కు సరిపడా సరుకు లేని నేపథ్యంలో ధరలు పెరిగినట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం బఫర్ స్టాకుల నుంచి ఉల్లిని సరఫరా చేసే చర్యలు చేపట్టినా ధరలకు క్లెం పడేలా లేదు. శనివారం కేంద్రం ధరలను స్థిరీకరించడానికి ఎగుమతిపై 40 శాతం సుంకాలను విధిస్తూ నిర్ణయం తీసుకుంది. బఫర్ స్టాకుల నుంచి సరఫరాతో పాటు నేషనల్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) ద్వారా ఉల్లి కొనుగోలుకు ఏర్పాట్లు చేసింది.

డిసెంబర్ 31 వరకు ఆంక్షలు

వచ్చేనెలలో ఉల్లి ధరలు బాగా పెరగవచ్చనే సమాచారంతో కేంద్రం 40 శాతం ఎగుమతి సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకుని ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు అమలులో ఉండేలా చర్యలు తీసుకుంది. అక్టోబర్‌లో కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ధరల నియంత్రణకు చర్యలు చేపట్టేలా నిర్ణయాలు తీసుకుంది. ధరల పెరుగుదలను అంచనా వేసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి 1.50 లక్షల టన్నుల ఉల్లిని సేకరించింది.

పెరిగిన డిమాండ్

మార్కెట్‌లో ఒక్కసారిగా పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టు సరుకు లేకపోవడంతో ఉల్లి ధరలు పెరిగాయి. ఏప్రిల్–జూన్ మధ్య (రబీ సీజన్) దేశవ్యాప్తంగా ఉల్లి 65 శాతం మార్కెట్‌కు వస్తుంది. మరలా అక్టోబర్–నవంబర్‌లో (ఖరీఫ్ సీజన్)లో ఉల్లి సరఫరా ఉంటుంది. మహారాష్ట్ర, కర్ణాటక, రాష్ట్రంలోని కర్నూలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉల్లి రాష్ట్ర అవసరాలను తీర్చుతుంది. ప్రస్తుతం కర్నూలు, కర్ణాటక నుంచి ఉల్లి సరఫరా లేదు. దీంతో తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు రోజుకు పదుల సంఖ్యలో మాత్రమే ఉల్లి లారీలు వస్తున్నాయి. ఆదివారం హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాలు రూ.2,500 నుంచి రూ.3,000 ధర పలికింది.

‘కాపు’ కాసిన సంక్షేమం

- ఈనెల 30న కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదల
- నిడదవోలులో సీఎం చేతులమీదుగా లాంఛనంగా ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 54,511 మందికి రూ.81.77 కోట్ల మేర లబ్ధి



ఏలూరు (టూటౌన్): కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో ఇప్పటివరకు మూడు విడతలుగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదును జమ చేయగా, తాజాగా నాలుగో విడత నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 30న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు నేస్తం నాలుగో విడత సొమ్ములను లాంఛనంగా విడుదల చేయనున్నారు. అర్హులైన ప్రతి మహిళా బ్యాంక్ ఖాతాకు రూ.15 వేల చొప్పున జమ చేయనున్నారు. పూర్వ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 54,511 మంది కాపు మహిళలకు రూ.81.77 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

ఐదేళ్లలో రూ.75 వేల ఆర్థిక సహకారం

కాపు నేస్తం పథకంలో భాగంగా 2020 నుంచి 2024 వరకూ ఐదేళ్ల పాటు ఆయా వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.75 వేలు అందించనున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో రూ.45 వేలను ప్రభుత్వం అందించింది. తాజాగా నాలుగో విడతలో నిధులను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయనున్నారు. దీంతో కాపు, ఒంటరి, తెలగ, బలిజ మహిళలకు ఇప్పటివరకు వరుసగా నాలుగేళ్లలో రూ.60 వేల చొప్పున కాపు నేస్తం పథకంలో ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందించింది.

పశ్చిమగోదావరి జిల్లాలో..

కాపు నేస్తం నాలుగో విడతలో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 34,642 మంది మహిళలకు రూ.51.96 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది. ఈ జిల్లాలో తొలి విడతలో 24,199 మందికి రూ.36.31 కోట్లు, రెండో విడతలో 21,815 మందికి రూ.33.21 కోట్లు, మూడో విడతలో 31,472 మందికి రూ.47.21 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.


ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లావ్యాప్తంగా 19,869 మంది లబ్ధిదారులు ఉండగా రూ.29.81 కోట్ల మేరకు ప్రయోజనం చేకూరనుంది. ఈ జిల్లాలో తొలివిడతలో 27,339 మందికి రూ.41.85 కోట్లు, రెండో విడతలో 24,719 మంది మహిళలకు రూ.37.08 కోట్లు, మూడో విడతలో 20,154 మందికి రూ.30.23 కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందించారు.

కాపు నేస్తం లబ్ధిదారులు

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం లబ్ధి
ఏలూరు జిల్లాలో..		
2020–21	27,339	రూ.41.85 కోట్లు
2021–22	24,719	రూ.37.08 కోట్లు
2022–23	20,150	రూ.30.23 కోట్లు
2023–24	19,869	రూ.29.81 కోట్లు
పశ్చిమగోదావరి జిల్లాలో..		
2020–21	24,199	రూ.36.31 కోట్లు
2021–22	21,815	రూ.33.21 కోట్లు
2022–23	31,472	రూ.47.21 కోట్లు
2023–24	34,342	రూ.51.96 కోట్లు

అర్హులందరికీ పథకం వర్తింపు



జిల్లాలో అర్హులందరికీ కాపు నేస్తం పథకం వర్తింపజేస్తున్నాం. ఈ నెల 30న నిడదవోలులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా కాపు నేస్తం పథకం నాలుగో విడత నిధులను విడుదల చేయనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 54,511 మంది మహిళలకు రూ.81.77 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

– ఎస్.పుష్పలత, ఈడీ, కాపు/బీసీ కార్పొరేషన్, ఏలూరు

సీఎం జగన్ మేలు మరువలేం



కాపు నేస్తం పథకం ద్వారా ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఇప్పటికే మూడు విడతల్లో ఏడాదికి రూ.15 వేల చొప్పున రూ.45 వేలు ఆర్థిక సాయాన్ని అందుకున్నాం. తాజాగా నాలుగో విడతలో నిధులు రానుండటం సంతోషంగా ఉంది. సీఎం జగన్ మేలు మరువలేం.

– కోగంటి సరస్వతి, కాపు నేస్తం లబ్ధిదారురాలు, 42వ డివిజన్, ఏలూరు

క్లుప్తంగా

హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ



స్థానిక వేణుగోపాలస్వామి వీధిలో హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవి ప్రకాష్

ఆకివీడు: స్థానిక సత్యసాయి మందిరం వీధిలో శనివారం మారడుగుల సాయి లక్ష్మీ కమల సంధ్య హత్య జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ రవి ప్రకాష్ ఆదివారం పరిశీలించారు. హత్య జరిగిన తీరును, ఇతర కారణాల్ని కేసు దర్యాప్తు చేస్తున్న భీమవరం రూరల్ సీఐ నాగ ప్రసాద్ ద్వారా తెలుసుకున్నారు. ఆలయ పూజారిని, ఆ ప్రాంత నివాసుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ నాగప్రసాద్, ఎస్సై సత్య సాయి, ఏఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం



మీడియాకు వివరాలు చెబుతున్న పట్టణ సీఐ ఆకుల రఘు, ఎస్సై ప్రతాప్‌రెడ్డి

కైకలూరు: విలువైన ఆభరణాలు దొంగిలించిన ఇద్దరు దొంగలను కైకలూరు టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు, టౌన్ ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డి కేసు వివరాలు తెలిపారు. కైకలూరు సంతమార్కెట్ వద్ద పల్లపోతు రామ కృష్ణ టీ దుకాణం నడుపుతున్నాడు. అతనికి ఏలూరురోడ్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇల్లు ఉంది. ఆ ఇంట్లో 2022 నవంబరు 26న బంగారం, వెండి వస్తువులు దొంగిలించారు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు అనంతరం అత్తోటి జాన్‌పాల్, గొతు శేషులు దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. వారిని కైకలూరు బస్టాండ్ వద్ద అరెస్టు చేశామని సీఐ చెప్పారు. వారి వద్ద నుంచి 112.9 గ్రాముల బంగారం, 116.7 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ కల సాకారం

- నరసాపురంలో తొలిదశలో రూ.87 కోట్లతో పనులు
- 1 నుంచి 9 వార్డుల్లో మొదటి విడత పనులు
- మొత్తం రూ.220 కోట్లతో మున్సిపాలిటీలో ప్రాజెక్ట్

నరసాపురం: నరసాపురం పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ ప్రాజెక్ట్ కల త్వరలోనే సాకారం కాకుంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు మొదటివిడతగా మంజూరు చేసిన రూ.87 కోట్లతో పనులు మొదలు పెట్టడానికి అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో పట్టణంలో 1 నుంచి 9 వరకూ వార్డుల్లో మొదటి విడతగా చేపట్టనున్న పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. పట్టణం మొత్తం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.220 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొదటి దశలో పనులకు ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఈ పనులకు గత ఏడాది నవంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు మొదలు పెట్టించడానికి చీఫ్ విప్ ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాబోయే 50 ఏళ్ల వరకూ పట్టణంలో డ్రెయినేజీ ఇబ్బందులు ఉండవు.

పట్టణం డ్రెయినేజీ వ్యవస్థ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అస్తవ్యస్తంగా తయారైంది. గత టీడీపీ హయాంలో ప్రణాళికా బద్ధంగా డ్రెయినేజీ నిర్మించకపోవడం, పనుల్లో నాణ్యతా లోపాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనకు భారీ ప్రాజెక్ట్ మంజూరవుతుందని గత పాలకులు ఎన్నో ఏళ్ల నుంచి హామీలు గుప్పిస్తూ వచ్చారు. ప్రత్యేక ప్రాజెక్ట్ సంగతి అటుంచి ప్రస్తుతం ఉన్న డ్రెయినేజ్‌లు కూడా సవ్యంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు సార్లు వచ్చిన గోదావరి పుష్కరాల్లో కూడా నిధులు వచ్చినా ఆ సమయాల్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం అవినీతి వల్ల సొమ్మంతా బూడిదలో పోసిన పన్నీరైంది. అవసరమైన చోట డ్రెయినేజీలు నిర్మించకపోవడం, నిర్మించిన డ్రెయిన్లు కూడా ప్రణాళికా బద్ధంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నాణ్యతా లోపాలతో చాలా డ్రెయిన్లు శిథిలమయ్యాయి.



రాయిపేటలో డ్రెయినేజ్ వ్యవస్థ

సరిగా లేని అవుట్‌లెట్లు

ప్రస్తుతం పట్టణంలో చాలా ప్రాంతాల్లో డ్రెయినేజ్ ఇబ్బందులున్నాయి. బస్టాండ్ సెంటర్, మాధవాయిపాలెం, రాయపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ప్రధాన డ్రెయినేజీలున్నాయి. వార్డులోని పలు వీధుల్లో ఉన్న ఉప డ్రెయిన్లన్నీ ఈ ప్రధాన డ్రెయినేజీల్లో కలుస్తాయి. ప్రధాన డ్రెయిన్లన్నీ గోదావరిలో ఐదు చోట్ల కలుస్తాయి. మురుగు గోదావరిలో కలిచే చోట అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు సరిగా లేవు. గోదావరిలో మురుగు కలిసే చోట అవుట్ లెట్‌లు సరిగా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉంటుంది. ఇక డ్రెయినేజీలు అధ్వానంగా ఉండడంతో వర్షం వస్తే బస్టాండ్ ఏరియా, పొన్నపల్లి, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.. 21, 22, 23, 24, 25, 26, 27 వార్డులు, పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్ పేట ప్రాంతాల్లో మైనర్ డ్రెయిన్లు శిథిలమయ్యాయి. స్టీమర్‌రోడ్డు లాంటి కీలకప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు చీఫ్ విప్ ముదునూరి పూనుకున్నారు. టీడీపీ రాజకీయ దురుద్దేశంతో పనులకు ఆటంకాలు సృష్టించింది.

నరసాపురం		
పట్టణ జనాభా	-	60 వేలు
విస్తీర్ణం	-	11.275 చ.కి.మీ
పట్టణంలో ఉన్న డ్రెయిన్ల విస్తీర్ణం	-	25.450 కి.మీ.
పక్కా డ్రెయిన్లు	-	12.697 కి.మీ.
కచ్చా డ్రెయిన్లు	-	8.493 కి.మీ.
మేజర్ డ్రెయిన్లు	-	4.260 కి.మీ.
ఇంకా నిర్మించాల్సిన విస్తీర్ణం	-	4 కిలోమీటర్లు

50 ఏళ్ల వరకూ సమస్యలు ఉండవు



పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. లెవల్స్ ఎక్కడా సరిగా లేవు. టీడీపీ హయాంలో నాణ్యత లేకుండా కట్టేశారు. దీంతో కొద్దిపాటి వర్షం వస్తే డ్రెయినేజీల్లో నీరంతా రోడ్లమీదే పారుతోంది. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగానే రూ.220 కోట్లు అంచనాలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పారు. మొదటి దశలో రూ.87 కోట్ల పనులకు ఫైనాన్షియల్ అనుమతులు ఇచ్చాం. మొదటి దశలో 1 నుంచి 9 వరకూ వార్డుల్లో పనులు చేపట్టబోతున్నాం. ప్రాజెక్ట్ పూర్తయితే పట్టణంలో రాబోయే 50 ఏళ్ల వరకూ డ్రెయినేజీ ఇబ్బందులు ఉండవు. –ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ఎమ్మెల్యే ఎలీజాకు సోదర వియోగం



పరామర్శించిన చింతలపూడి నియోజకవర్గ నాయకులు

జంగారెడ్డిగూడెం రూరల్: చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా సోదరులు ఉన్నమట్ల దైవాభిమాని మృతి చెందారు. ఏలూరులోని దైవాభిమాని భౌతికకాయాన్ని నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఎలీజాకు సానుభూతి తెలిపారు. లక్కవరంలో గ్రామంలో జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఉండి: ఉండి మండలం చెరుకువాడ పరిధిలోని ఉండి పంటకాలువలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు. ఆదివారం మృతదేహాన్ని గుర్తించిన వీఆర్‌ఓ దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కాలువలోని మృతదేహాన్ని బయటకు తీయగా గుర్తు పట్టలేనంతగా కుళ్లిపోవడంతో వివరాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

పాలకొల్లు అర్బన్: గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ యు.రవి ప్రకాష్ తెలిపారు. పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని బల్లిపాడు డంపింగ్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో రూరల్ ఎస్సై, కానిస్టేబుళ్లు దాడి చేసి బండి కిరణ్‌కుమార్ (మేడపాడు), అత్తిలి వంశీ ఫణీంద్ర (తణుకు), మహ్మద్ సాధిక్ (ఇరగవరం), వెంద్రపాటి అనిల్‌కుమార్ (లక్ష్మీపాలెం, రావులపాలెం)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.90 వేలు విలువైన 21 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్‌లు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు లంబసింగి నుంచి కిలో రూ.3 వేల చొప్పున ఖరీదు చేసి గంజాయి తీసుకువచ్చారన్నారు. మారి శ్రీను (తణుకు), వెంకట్ (ఏనుగువానిలంక) పరారీలో ఉన్నారన్నారు. వారిని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. గంజాయిని అరికట్టడంలో జిల్లా పోలీసు యంత్రాంగం విశేషంగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో 41 పైగా కేసులు నమోదు చేశామన్నారు. 200 మందికి పైగా వ్యక్తులపై చట్టపరంగా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

వాహనాలపై శంఖు, చక్ర నామాలు





ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి కొండపైన భక్తుల వాహనాల అద్దాలపై గోవిందుడి శంఖు, చక్ర నామాలు, గజ, నెమలి, ఓంకారం తదితర ఆర్ట్స్ వేస్తున్నారు. శ్రీశైలం తరహాలో వాటర్ పెయింట్లు, విభూదిని వినియోగించి వేస్తున్న ఈ ఆర్ట్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. భక్తులు తమ కార్లు, ఆటోలు, బస్సులు, లారీలపై ఈ ఆర్ట్స్‌ను వేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాహనాన్ని బట్టి దేవస్థానం నిర్ణయించిన ధరలకు ఈ ఆర్ట్స్ వేస్తున్నారు. - ద్వారకాతిరుమల

రాష్ట్ర స్థాయి పోటీలకు చెస్ విజేతలు

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో అండర్ 15 బాలుర, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు భీమవరంలో ఆదివారం నిర్వహించారు. విజేతలకు పాలకోడేరు ఎస్సై ఎస్.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. పోటీల్లో బాలుర విభాగంలో సాత్విక్ (తణుకు), నల్లం వరుణ్ తేజ్ (భీమవరం), కుష్వంత్ నీలి (భీమవరం), గమిని శౌర్య(భీమవరం) బాలికల విభాగంలో భవిష్య (భీమవరం), పులవర్తి శ్రీనిధి (భీమవరం), రిషిత మల్లినీడి (తణుకు), లక్ష్మీ హర్షిత మల్లుల (తణుకు) విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పిల్లలకు బాల్యం నుంచి వారి అభిరుచి మేరకు వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యలో రాణిస్తారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన నలుగురు బాలురు ఆగస్టు 24 నుంచి 27 వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 15 పోటీలకు, నలుగురు బాలికలు సెప్టెంబర్ 4 నుంచి 7 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే అండర్ 15 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవి పవన్ కుమార్ , ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, కోశాధికారి శిరిగినీడి కోటేశ్వరరావు, టౌన్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు, సురేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

వాండ్రంలో ప్రశాంత పరిస్థితులు

ఉండి: గత కొద్ది రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన వాండ్రంలో ఆదివారం ప్రశాంత వాతావరణం నెలకొంది. డీఎస్పీ కే శ్రీనాథ్ ఆదివారం వాండ్రంలో పర్యటించారు. స్థానికంగా ఉన్న ఎస్సీ నాయకులు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇరువర్గాలు ఎవరి పనులు వారు చేసుకుంటూ ప్రశాంతంగా జీవించాలని, గత సంఘటనలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలకు తెలిపారు. ఇతరుల మాటలు విని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని.. అలా చేస్తే కఠిన శిక్షలు తప్పవని డీఎస్పీ తెలిపారు. గ్రామంలో కొద్ది రోజులు పోలీస్ పికెటింగ్ ఉంటుందని తెలిపారు. వాండ్రంలో లూథరన్ చర్చ్‌పై దాడి ఘటనలో చర్చ్ సంఘ పెద్దలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 18న రాత్రి వాండ్రం లూథరన్ చర్చ్‌పై గ్రామ సర్పంచ్ దాసరి కృష్ణ ప్రోద్బలంతో కొందరు కర్రలతో దాడి చేసి కులం పేరుతో దూషిస్తూ భయభ్రాంతులకు గురి చేసినట్లు సంఘ పెద్దలు కోనాల రాజేంద్రకుమార్ తదితరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు. కేసును డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వాండ్రంలో దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ శ్రీనాథ్

సరైన యాజమాన్యంతో ఎండాకు తెగులు నివారణ



ఎండాకు లక్షణాలు కనిపిస్తున్న వరి నారు

పెనుమంట్ర: సార్వాలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సమస్యాత్మకంగా ఉందని యాజమాన్య పద్ధతుల ద్వారా దీనిని నివారించవచ్చని మార్టేరు వ్యవసాయ వరి పరిశోధనా సంస్థ తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.భువనేశ్వరి తెలిపారు. చాలామంది రైతులు దీనిని కాండం కుళ్లు దుబ్బు తెగులుగా భావించి శిలీంధ్ర నాశినిని పిచికారీ చేయడం వల్ల తెగుళ్ల నివారణ జరగకపోగా సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోతాయన్నారు. నారుమడి దశ నుంచి నాట్లు వేసిన నెల రోజుల వరకు వరిపంటను ఆశిస్తుందని, కొన్ని పరిస్థితుల్లో 30 రోజులు తరువాత కూడా ఈ తెగులు ఆశిస్తుందని తెలిపారు. నారుమడి ఆకుల అంచుల నుంచి లోపలి వైపునకు నీటిడాగు మాదిరిగా ఏర్పడి క్రమేపి పసుపురంగుగా మారుతుందన్నారు. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి మంచినీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలన్నారు. ఇలా చేయడం వల్ల తెగులు సోకిన భాగాలనుండి బాక్టీరియా నీటిలోకి స్రవించడం ద్వారా కొద్దిగంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారుతుందన్నారు. ఈ లక్షణాలు ఉంటే ఎండాకు తెగులుగా గుర్తించాలన్నారు. కాండం కుళ్లు ఆశించిన పిలకలను గమనిస్తే మొదటికణుపు వద్ద కుళ్లిన మొక్క చనిపోతుందన్నారు. బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఇలాంటి కుళ్లు లక్షణాలు కనిపించకుండానే పిలకలు ఎండిపోతాయన్నారు. తెగులు సోకని ఆరోగ్యవంతమైన పొలం నుంచి మంచి విత్తనం సేకరించి నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మేరకే రెండు మూడు దఫాలుగా వాడుకోవాలన్నారు. స్వర్ణ, ఎంటీయూ 1318 రకాలలో ఎక్కువ నత్రజని వేయకూడదన్నారు. ఆకులపై తెగుళ్ల లక్షణాలు 5 శాతం కంటే ఎక్కువగా వ్యాపించి ఉంటే నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. సిఫార్సు చేసిన పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలో, అంకురం దశలో వేసుకోవాలన్నారు. పొలం గట్లపై బ్యాక్టీరియా ఆవాసం కల్పించే కలుపు, ఇతర పిచ్చిమొక్కలు లేకుండా గట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే పొలంలో నీటిని రెండు లేదా మూడు సార్లు మురుగునీటి కాలువల ద్వారా బయటకు తొలగించడం వల్ల ఉధృతి తగ్గుతుందన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

భీమవరం అర్బన్: బైక్‌పై వెళుతుండగా, వెనుక మరో బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన ఆకుల వెంకట్రావు ఆదివారం గూట్లపాడులో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్‌పై వస్తుండగా గూట్లపాడు రేవు వద్ద వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బంధువులు భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెంకట్రావును తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ 22వ వార్డుకు చెందిన కాగిత బాలాజీ కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్లు ఏఎస్సై కె.శ్రీనివాసరావు తెలిపారు. మతిస్థిమితం లేని బాలాజీ ఈ నెల 17న ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి అనంత లక్ష్మి ఆదివారం ఫిర్యాదు చేసింది.

వర్షాలు లేక నాట్లు ఆలస్యం

- జిల్లాలో 2.19 లక్షల ఎకరాలకు 79 శాతం పూర్తి
- భీమవరం, నరసాపురం డివిజన్లలో సగం కూడా పూర్తవ్వని నాట్లు

సాక్షి, భీమవరం: సార్వా సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అనుకూలించకపోవడంతో ఈ ఏడాది నాట్లు ఆలస్యమయ్యాయి. పంట కాలువలపై ఆధారపడి ఇంతవరకూ దాదాపు 79 శాతం సార్వా వరినాట్లు పూర్తిచేశారు. సార్వా సీజన్ ప్రారంభంలో మోస్తరు వర్షాలు పడినప్పటికీ ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో నాట్లు వేయడంలో తీవ్ర జాప్యం జరిగింది. పూర్తిగా పంట కాలువ నీటిపైనే ఆధారపడడంతో నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు వ్యవసాయ సబ్ డివిజన్స్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉండగా 1.73 లక్షల ఎకరాల్లో పూర్తి చేశారు.

లోటు వర్షపాతంతో ఇబ్బందులు

సార్వా సీజన్‌లో ముందస్తు నాట్లకు వ్యవసాయశాఖ రైతులను సన్నద్ధం చేసింది. జూన్‌లో నారుమళ్లు పూర్తిచేసుకుని జూలై నెలాఖరు నాటికి నాట్లు వేయడం వల్ల మంచి దిగుబడులు సాధించడమేగాక ముందస్తు దాళ్వాకు అనుకూలంగా ఉంటుందని విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో రైతులు ముందుగానే విత్తనాలు సిద్ధం చేసుకుని నారుమళ్లు వేయడానికి సన్నద్ధమైనప్పటికీ వర్షాలు లేక నీరు సక్రమంగా అందలేదు. జిల్లా వ్యాప్తంగా జూన్ నెలలో 108.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావల్సి వుండగా కేవలం 59.9 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. జూలైలో 245.6 మిల్లీమీటర్లకు 192.9, ఆగస్టులో 149.7 మిల్లీ మీటర్లకు ఇప్పటి వరకు కేవలం 16.6 మిల్లీమీటర్లు మాత్రమే కురువడంతో సాగుకు ఇబ్బందులేర్పడ్డాయి.




వీరవాసరం మండలం పంజావేమవరంలో సార్వా వరి పైరు

1.73 లక్షల ఎకరాల్లో వరిసాగు

జిల్లాలోని 20 మండలాకు 6 వ్యవసాయ సబ్ డివిజన్స్ ఉండగా సుమారు 2.19 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సివుంది. ఇంతవరకు 1,72,977 ఎకరాల్లో నాట్లు పూర్తిచేశారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో సుమారు 95 శాతం పైగా నాట్లు పూర్తికాగా తణుకులో 87 శాతం, నరసాపురంలో 44 శాతం, భీమవరంలో 45 శాతం, పాలకొల్లులో 68 శాతం, ఆకివీడు సబ్ డివిజన్లలో 72 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నరసాపురం, భీమవరం డివిజన్లు నాట్లు వేయడంలో బాగా వెనుకంజలో ఉన్నాయి.

మరో వారం రోజుల్లో నాట్లు పూర్తి



ప్రస్తుత సార్వా సీజన్‌లో వర్షాలు సక్రమంగా లేక నాట్లు వేయడంలో జాప్యం జరిగింది. జూన్ నుంచి మూడు నెలలు లోటు వర్షపాతమే. కేవలం కాలువల నీటితోనే సాగు ఆధారపడడం వల్ల కాలువ శివారు భూములకు నీటి ఎద్దడి ఏర్పడి నాట్లు ఆలస్యమయ్యాయి. గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో మరో వారం రోజుల్లో నాట్లు పూర్తయ్యే అవకాశముంది.

జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ట్రస్టీ చెన్నా జనార్దన్ ఆధ్వర్యంలో దాత వాణి సహకారంతో ఆదివారం నిడదవోలు లెప్రసీ కాలనీలో 300 కేజీలు, తాడేపల్లిగూడెంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీలు, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌కు 150 కేజీల బియ్యం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో దుర్గా ప్రసాద్, నాగరాజు, నిర్వాహకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్యశిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యాన ఆదివారం కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో పూర్వ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలులోని రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్య బృందంతో 103 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచిత కంటి ఆపరేషన్‌లకు 13 మందిని నిడదవోలు పంపారు. 22 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు అందజేయనున్నారు. శిబిరాన్ని క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ పచ్చా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, ఎంవీవీ రామకృష్ణ, గోగు కిరణ్ కుమార్, కె.నరసింహమూర్తి, డీవీపీ విశ్వేశ్వరరావు పెరుమళ్ళ నాగేశ్వరరావు, ఆంజనేయుస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవి ఆలయంలో లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు



ఆలయంలో లక్ష్మీగణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో శ్రావణ మాసం శుద్ధ చవితి పురస్కరించుకుని ఆదివారం విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం అనంతరం లక్ష్మీగణపతికి పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్య, ఆలయ కార్యదర్శి కురిసేటి శ్యాం గుప్తా పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తణుకు అర్బన్: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యాన తణుకు సత్యసాయి సేవా సమితి ఆదివారం స్థానిక బాల వికాస్ సెంటర్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించింది. గ్రేడ్ 1, 2 విభాగాల్లో సమితి స్థాయిలో డాక్టర్ జె.రామచంద్రరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో 60 మంది బాల బాలికలు పాల్గొన్నట్లు సేవా సమితి నాయకులు వారణాసి ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు. బాల వికాస్ గురువులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం కుటుంబ కలహాలతో కొట్లాడుకుని ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా, పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన మద్ది విజయలక్ష్మికి నలుగురు కొడుకులు. వారందరికీ వివాహాలయ్యాయి. ఇంట్లో నాలుగు పోర్షన్లు ఉండగా వాటికి ఒకే బాత్‌రూమ్ ఉంది. దీంతో పెద్ద కుమారుడు మద్ది విజయ శేఖర్ పిల్లలు బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో మద్ది వేణుగోపాల్ వారిపై కేకలు వేసి చీపురు కట్టతో మద్ది విజయలక్ష్మిని కొట్టి గాయపరిచాడని ఆమె ఫిర్యాదు చేసింది. మద్ది చంద్రకళను అన్యాయంగా మద్ది విజయ శేఖర్ కొట్టి గాయపరిచాడని ఇద్దరూ ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదులపై ఎస్సై బి.మోహన్‌రావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జయకేతనం

పంచాయతీ వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో సత్తా చూపిన పార్టీ



కృష్ణాయపాలెంలో విజయం సాధించిన గజ్జరపు అన్నపూర్ణ (వైఎస్సార్ సీపీ)



వీరంపాలెంలో గెలుపొందిన సకినాల గౌతమి (వైఎస్సార్ సీపీ)



పెంటపాడు మండలం చింతపల్లిలో విజయం పొందిన చీపుళ్ల కల్యాణి (వైఎస్సార్ సీపీ)

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. సంక్షేమ పథకాల లబ్ధిని పొందుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆ ఫలాలను అనుభవిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నామని మరోసారి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలాల్లో నాలుగు వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ నాలుగు స్థానాల్లో ప్రతిపక్షాలు అభ్యర్థిని బరిలోకి దింపడానికి కూడా జంకాయి. నామినేషన్ల ప్రక్రియ దశలోనే చేతులెత్తేశాయి. ఎన్నిక జరిగితే ఎదురయ్యే పరాభవాన్ని ముందుగానే ఊహించి మిన్నకుండా పోయాయి. ప్రజాపక్షం బలం ఉన్న వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెంటపాడు మండలం కె.పెంటపాడు గ్రామంలో టీడీపీ శ్రేణులు ప్రలోభాలతో ఓటర్లను తమవైపు తిప్పుకున్నాయి. ఎలాంటి దళారులు లేకుండానే వాకిట ముంగిటకు చేరుతున్న సంక్షేమ ఫలాలు, సమర్థవంతమైన పాలన, కష్టం వస్తే వెన్నుదన్నుగా నిలిచే పార్టీ శ్రేణులు, ప్రజాపక్షం వహించిన అభిమానం ప్రతిపక్షాల అభ్యర్థులను నిలుపకుండా చేయడంతో రెండు మండలాల్లోని మూడు స్థానాలు వైఎస్సార్ సీపీకి ఏకగ్రీవమయ్యాయి. ప్రజాభిమానాన్ని చూసిన పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

విజయులు వీరే..

పెంటపాడు మండలం చింతపల్లి గ్రామంలోని ఒకటో వార్డులో వైఎస్సార్ సీపీకి చెందిన చీపుళ్ల కల్యాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో ఒకటో వార్డుకు వైఎస్సార్ సీపీకి చెందిన గజ్జరపు అన్నపూర్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండలంలోని వీరంపాలెం రెండో వార్డుకు వైఎస్సార్ సీపీకి చెందిన సకినాల గౌతమి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తణుకులో సత్తా చాటిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులు



ముద్దాపురం 10వ వార్డులో ఏకగ్రీవంగా ఎన్నికైన గమిడి శ్రీను (వైఎస్సార్ సీపీ)



గోటేరు 5వ వార్డులో విజయం సాధించిన మెంటే రాధ (వైఎస్సార్ సీపీ)

తణుకు: తణుకు నియోజకవర్గంలో హోరాహోరీగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులు సత్తా చాటారు. నియోజకవర్గంలో ఒక సర్పంచ్ స్థానంతో పాటు నాలుగు వార్డు సభ్యుల స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇరగవరం మండలం కావలిపురం గ్రామ సర్పంచ్‌తో పాటు అదే గ్రామానికి చెందిన 2వ వార్డు, గోటేరు గ్రామంలోని 5వ వార్డు, తణుకు మండలం ముద్దాపురం గ్రామంలోని 10వ వార్డు, తేతలిలోని 8వ వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని భావించారు. అయితే ముద్దాపురం గ్రామంలోని 5వ వార్డు నుంచి వైఎస్సార్ సీపీ బలపర్చిన గమిడి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, కావలిపురం గ్రామంలోని 2వ వార్డు నుంచి టీడీపీ బలపర్చిన అభ్యర్థి దాకమూరి శ్రీను ఏకగ్రీవంగా గెలుపొందారు. శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో భాగంగా తేతలి గ్రామంలోని 8వ వార్డుకు, ఇరగవరం మండలం గోటేరు గ్రామంలోని 5వ వార్డుతో పాటు కావలిపురం గ్రామ సర్పంచ్ స్థానానికి ఎన్నికలు జరిగాయి. గోటేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థులు పోటీలో ఉండగా వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి మెంటే రాధ 17 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. ఇక్కడ టీడీపీ బలపర్చిన అభ్యర్థి మూడో స్థానంలో ఉండటం విశేషం. తేతలి గ్రామంలో కోట వెంకటేష్‌పై కోట దుర్గారావు కేవలం 9 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. కావలిపురం సర్పంచ్ స్థానానికి పోటీపడిన వనజర్ల అప్పన్నస్వామి, వనజర్ల సత్యవేణిల మధ్య హోరాహోరీగా జరిగిన పోటీలో చివరికి 164 ఓట్లు ఆధిక్యంతో వనజర్ల అప్పన్నస్వామి గెలుపొందారు.

వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 42 మంది వృద్ధులకు ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం , పరిసర గ్రామాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యుడు పైడిపర్రుకు చెందిన దాత అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్ నిర్ధారణ పరీక్షలు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతి నెలా మూడో ఆదివారం చేపట్టే ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 40 మందికి పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యుడు ఐ.సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు బీవీఆర్‌లో జానపద కళా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రం ఆధ్వర్యాన ఈనెల 22వ తేదీ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు జానపద కళా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆదివారం తెలిపారు. జానపద నృత్యాలు, కోలాట బృందాలు, గరగల నృత్యాలను కళాకారులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల్లో పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

జగనన్న ప్రభుత్వంలోనే హాస్టళ్ల అభివృద్ధి

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు



పరిమెళ్లలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించిన చీకటిమిల్లి మంగరాజు

పెంటపాడు: జగనన్న ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఆదివారం ఆయన పరిమెళ్లలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఎలా ఉంటోంది. బాత్‌రూమ్‌లు సరిగా ఉంటున్నాయా, రగ్గులు, పుస్తకాలు, కాస్మోటిక్స్ ఇతర సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులు సంతృప్తికర సమాధానాలు చెప్పడంతో హర్షం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో సమస్యలు ఉండేవన్నారు. నేడు జగనన్న అభివృద్ధి, సంక్షేమం పేరిట విద్యా వ్యవస్థలో నాడు- నేడు పథకం ద్వారా సమూల మార్పులు తీసుకురావడంతో పాటు, అమ్మఒడి, వసతి దీవెన తదితర పథకాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, కుక్, కమాటీ సిబ్బంది పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమను నిర్మూలించాలి



తాడేపల్లిగూడెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లార్వా దశలోనే దోమను నిర్మూలించాలని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలైన యాగర్లపల్లి, కడకట్ల, వీకర్స్ కాలనీ, బేబీ సెంటర్ వైద్యాధికారులు ఆశా లత, చైతన్య, అమృత, శ్రావ్య అన్నారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారుల ఆధ్వర్యాన పట్టణంలోని పలు కూడళ్లలోఅవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల వ్యాప్తికి దోమలే కారణమని శాస్త్రవేత్తలు కొనుగొన్నారని, ఆడ దోమలు వల్లే వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ దోమల నిర్మూలనకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటి వద్ద డ్రై డే పాటించేలా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆరోగ్య సిబ్బందితో దోమల నిర్మూలనకు కృషి చేద్దామని, ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, వలంటీర్లు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రామకృష్ణ, ప్రసాద్‌బాబు, సాయి, శ్యామ్, ల్యాబ్ టెక్నిషియన్లు తదితరులు పాల్గొన్నారు.

'హలో మాదిగ చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి



సమావేశానికి హాజరైన విస్సంపల్లి సిద్ధు మాదిగ, సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 'హలో మాదిగ చలో హైదరాబాద్' కార్యక్రమానికి మాదిగ కులస్తులు తరలి రావాలని సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి విస్సంపల్లి సిద్ధు మాదిగ కోరారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం లక్షలాది మందితో త్వరలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు వేల సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సీ వర్గీకరణ చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో కొల్లి రాజశేఖర్, దూలపల్లి శ్రీనివాసరావు, వాసు, చిన్ని, రాజేంద్ర, నాని, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింటి అమ్మకు శ్రావణ సారె సమర్పణ

ఆకివీడు: స్థానిక పెద్దింటి అమ్మవారికి శ్రావణ మాస సారెను ఆదివారం వెలంపేట మహిళలు సమర్పించారు. వెలంపేట రామాలయం నుంచి మహిళలు సన్నాయి, డప్పు వాయిద్యాలతో, చలివిడి, పానకాలు నింపిన బిందెల కావిడులతో ఊరేగింపుగా మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- తాడేపల్లిగూడెం 19వ వార్డులో గడప గడప మన ప్రభుత్వం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం 19వ వార్డులో ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలు స్వయంగా చెబుతుంటే ఆనందం కలుగుతుందని, తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇలాంటి సంతోషం చూడలేదన్నారు. గతంలో వైఎస్సార్, ఇప్పుడు సీఎం జగన్ అందిస్తున్న సేవలు మకుటంలా నిలిచాయన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

19వ వార్డులో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి కొట్టు సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ డి మురళీకృష్ణ, కర్రి భాస్కరరావు, మానికొండ వెంకటేశ్వరరావు, సింగం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేలంగిలో ఎంఆర్‌పీఎస్ నాయకుల సమావేశం

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు తాతపూడి బోస్ మాదిగ అధ్యక్షతన ఎంఆర్‌పీఎస్ నాయకులు సమావేశమయ్యారు. మహాజన సోషలిస్ట్ పార్టీ తణుకు ఇన్‌ఛార్జి విసంపల్లి సిద్ధు మాదిగ హాజరై మాట్లాడారు. మంద కృష్ణ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం త్వరలో హలో మాదిగ ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా హాజరయ్యేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

22వ వార్డులో మావుళ్లమ్మ జాతర ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువత నాయకుడు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతరను రవితేజ ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతరను పట్టణంలో వాడవాడలా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కరుకు పోతురాజు, బూది శ్రీను, మోది అప్పారావు, అమ్మాణి కృష్ణ, కరుకు ఏడుకొండలు పాల్గొన్నారు.

22న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో ఈ నెల 22న పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, మానవతా తదితర స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. ఇతర వివరాల కోసం 99490 93115, 9440859700 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

సంధ్యారాణి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



ఆకివీడులో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఆకివీడు: ప్రేమించి, పెళ్లి చేసుకున్న భార్యను అత్యంత కిరాతకంగా చంపిన వాడపల్లి రాంబాబును ఉరి తీయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మహిళలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దుంపగడప గేటు వద్ద నుంచి మహిళలు, వివిధ పార్టీల నాయకులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ అతి కిరాతకంగా భార్య సంధ్యను చంపిన హంతకుడు రాంబాబును ఉరి తీయాలని ఆమె డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి అండగా ఉండాలని, న్యాయం జరిగే వరకూ పోరాడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, పుప్పాల పండు, ఎండీ మస్తాన్‌వలీ, షేక్ హుస్సేన్, గుండా సుందరరామనాయుడు, ఎండీ మాబూ, రంభ శివ, సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, బొక్కా వర్మ, డోకల సత్యవతి, సందక సూర్యకుమారి, డోకల రవితేజ, రాంబాబు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, మహిళలు అధికసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఉగిరాల పద్మ S/O శ్రీనివాసరావు,ఇంటి.నెం.2-141, దువ్వ గ్రామం, తణుకు మండలం. నా పాస్‌పోర్ట్ (నెం. X0985711) ఇల్లు మారుతుండగా పోయినది. ఎంత వెదికినా దొరకలేదు. దొరికిన వారు తెలియపర్చగలరు.

90598 27297

వ్యవసాయం, ఆక్వాకు అధిక ప్రాధాన్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- చినపుల్లేరులో వంతెన ప్రారంభం



చినపుల్లేరులో వంతెనను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: వ్యవసాయం, ఆక్వా సాగుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం చినపుల్లేరు శివారు మంగలకోడుపై రైతులు స్వచ్ఛందంగా రూ.10 లక్షలతో నిర్మించుకున్న వంతెనను రైతుల కోరిక మీదట పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి, ఆక్వాకు మద్దతుగా నిలిచి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రైతుకు నష్టం కలిగితే వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందు ఉంటోందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 సాయం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు, ఇతర పెద్దమనుషుల హేళనగా మాట్లాడినా రైతులకు వ్యవసాయం పండగ చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. రైతులకు తక్కువ ధరకు ఎరువులు, పురుగుమందులు గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. సబ్సిడీపై విత్తనాలు, విపత్తు సమయాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం వంటివి పూర్తిస్థాయిలో అందిస్తోందన్నారు. అలాగే పూర్తి స్థాయిలో పంటకు మద్దతు ధరను అందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఆక్వా సాగుకోసం నడుంబిగించి కరోనా కష్ట సమయంలో రైతులకు అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని రైతులు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. సీడ్ ధరలు తగ్గించి, నాణ్యమైన సీడ్ అందించడం, కౌంట్ ధరలు పెంచడం వంటివి చేసి గత కరోనా కాలం నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుకు అండగా నిలిచిందన్నారు. ముఖ్యంగా పదెకరాలలోపు రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను సబ్సిడీపై అందించి వారికి మరింత దన్నుగా నిలిచిందన్నారు. గ్రామ సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మ, పెన్మత్స రామరాజు, కాళ్ల జడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, బొండాడ సర్పంచ్ గోళ్ళ పండు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బొర్రా వెంకన్న (తాతయ్య), బొర్రా సుబ్బారావు, బొర్రా వెంకటేశ్వరరావు, అల్లూరి చంద్రరాజు, అంజనేయులు, గుడ్ల గొల్లయ్య, బొర్రా రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.